


# సత్యవాక్యు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JULY - 2018**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

**సంపుటి - 39** **జూలై - 2018** **సంచిక -12**


## మనము పుట్టుకతోనే పాపులమా?

### ( Are We born Sinners ? )

మానవులు పుట్టుకతోనే పాపులా? ఆదిమ పాపము అనునది వారసత్వము వలన కలుగునా? యను ప్రశ్నలను పాఠకులు అప్పుడప్పుడు మాకు వ్రాస్తూయుంటారు. ఈ ప్రశ్నల జవాబు కొరకు మనము బైబిలునే సంప్రదించుదాము.

మానవులు పుట్టుకతోనే పాపులు కాదు. పాపము వారసత్వము వలన కలుగదు అని బైబిలు బోధించు చున్నది. ఒకడు పాపము చేయుట వలన పాపము కలుగును గాని, వారసత్వము వలన కానేకాదు. యెహోవా దేవుడు ఇట్లనుచున్నారు : "పాపము చేయువాడే మరణము నొందును; తండ్రి యొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు; నీతిపరుని నీతి ఆ నీతి పరునికే చెందును, దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). యేసు తల్లియైన మరియ ఆదిమ పాపమేమియు లేకుండ

జన్మించినదని కొందరు బోధింతురు. అది నిజమే. ఆమె మాత్రమే కాదు నీవు, నేను, మరి అందరు కూడ ఆదిమ పాపమనేది లేకుండగనే ఈ లోకములో జన్మించితిమి. మనలో ఎవడును పాపమును వారసత్వముగ పొంది యుండలేదు.

మనము జన్మతోనే పాపులము కాదు. మనకు విచక్షణ జ్ఞానము కలిగిన తరువాత, దేవుని ఆజ్ఞను అతిక్రమించుట వలన పాపము చేసిన వారమైతిమి. ఇందు విషయమై "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (1యోహాను 3:4). దేవుడు మన ఆత్మల తండ్రియై యున్నాడని హెబ్రీ 12:9లో వ్రాయబడి యున్నది. మనము ఆయన సంతానమని అపొ.కా. 17:29లో చెప్పుచున్నది. అట్లయినప్పుడు మనము పుట్టుకతోనే పాపులమయిన యెడల దేవుడే మన పాపపు స్థితికి కర్తయగును గదా? అయితే మన మట్లనరాదు. మనము పాపమును వారసత్వము వలన పొందలేము. పాపము యొక్క ప్రతిఫలమును మనమనుభవించ వలసి వచ్చును గాని పాపమును కాదు. ఆదాము హవ్వలు పాపము చేయగా వారు పాపులైరి. వారి పాపము వలన ఈ లోకములో మరణము సంప్రాప్తమాయెను. మానవులందరు వారి పాపము వలన మరణమునకు లోనగుచున్నారు, గాని ఆదాము హవ్వల పాపమును ఎవరు వారసత్వము వలన పొందలేదు.

మానవులు పాపముతోనే పుట్టి యున్నారని రోమీయులకు వ్రాసిన పత్రిక 5వ అధ్యాయము బోధించుట లేదు. పాపము ఒక మనుష్యుని ద్వారా అనగా ఆదాము ద్వారా ఈ లోకమందు ప్రవేశించెనని అది

బోధించుచున్నది. అట్లే నీతి కూడ ఒక మనుష్యుని ద్వారా అనగా క్రీస్తుయేసు ద్వారా ప్రవేశించెనని అది బోధించు చున్నది. ఈ లోకములో పాపము ప్రవేశించినందున కాదుగాని మానవు లందరు పాపము చేయుట వలన వారు పాపులైరి (రోమా 5:12). ఈ లోకములో నీతి ప్రవేశించినందున నీతి పరులు నీతిమంతులవలేదు గాని క్రీస్తు ఈలోకమునకు తెచ్చిన నీతికి వారు విధేయులగుటవలన నీతిపరులైరి. ఒకడు నీతిమంతుడగుటకెట్లు షరతు లున్నవో, అట్లే పాపుడగుటకుకూడాను. ఒకడు పాపియగుటకు పాపము చేయవలెను. ఒకడు నీతిపరుడగుటకు నీతిని జరిగించవలెను. పరిశుద్ధాత్మా వేశము గలవాడై పేతురు ఇట్లనెను : "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును" (అపొ.కా. 10:34, 35). అట్లే "పాపము చేయువాడు ప్రతివాడును పాపమునకు దాసుడని" యేసు నిశ్చయముగా చెప్పెను (యోహాను 8:34). దీనిని బట్టి ఒకడు నీతిపరుడని లేక పాపి యని అతడు చేయుదానిని బట్టియేగాని అతని జన్మను బట్టి పరిగణింపబడడని మనము గ్రహించవలెను. "నీతి మంతుడు లేడు, ఒక్కడును లేడు; గ్రహించువాడెవడును లేడు, దేవుని వెదకువాడెవడును లేడని" రోమా 3:10,11లో వ్రాయబడి యున్నది. గనుక అందరు జన్మతోనే పాపులని కొందరు తలంచెదరు. అయితే అట్టి వారెవరో తరువాత వచనములలో చెప్పబడినది. వారు అందరు త్రోవ తప్పినవారు, పనికిమాలినవారు, వారి గొంతుక తెరచిన సమాధి, తమ నాలుకతో మోసము చేయుదురు, వారి పెదవుల క్రింద సర్పవిషమున్నది, వారి నోటినిండ శపించుటయు, పగయు ఉన్నవి. రక్తము చిందించుటకు వారి

పాదములు పరుగెత్తు చున్నవి. వారి కన్నుల యెదుట దేవుని భయములేదు, అని రోమా 3:12-18 వరకు వ్రాయ బడియున్నది. నిజానికి వీరు పెరిగి పెద్దవారై బాధ్యతా యుక్త వయస్సు, ప్రవర్తన కలిగినవారు. వీరు పసిబిడ్డలు కాదని మనము ఇట్టే గమనించుకొన గలము.

"నేను పాపములో పుట్టిన వాడను, పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను" అని దావీదు కీర్తనలు 51:5లో వ్రాసెను గదా మరి అది పుట్టుకతోనే పాపమును సూచించు చున్నది కదా యని మీరనుకొనుచుండ వచ్చును. దావీదు పాపములో పుట్టితిని, పాపములోనే నా తల్లి గర్భమును ధరించెను అని చెప్పెను గాని పాపముతో కాదు అని గ్రహించవలెను.

పాపము అతిఘోరమైనది, భయంకరమైనది. ఆదాము హవ్వలు పాపము చేయగా, దేవుడు వారి కిచ్చిన తీర్పు భయంకరమైనది. దాని ఫలితములు ఇంకా ఘోరమైనవి. పాపముతో నిండియున్న ప్రజల పాపములవలన కాదుగాని, ఒక స్త్రీ-పురుషుల పాపము వలననే ఇంత ఘోరమైన ఫలితములు కలిగెనని జ్ఞాపకముంచుకొనవలెను. పాపము చేసినందున స్త్రీ వేదనతో పిల్లలను కనును, పురుషుడు తన ముఖపు చెమట కార్చి ఆహారము తినును. నేల అయితే ముండ్ల తుప్పలను, గచ్చ పొదలను మొలిపించును అని దేవుడు తీర్పు తీర్చెను. ఇవన్నియు బహుశ మానవునికి పాపమును గూర్చి జ్ఞప్తి చేయు నిమిత్తము విధింపబడెను. అంతే కాదు ఆ మొదటి స్త్రీపురుషుల పాపము వలన మానవులందరు దాని ఫలితమునకు అనగా మరణమునకు గురియగుచున్నారు (1కొరింథీ 15: 21,22).

పాపము వలన దేవుడు ఈ లోకము నంతటిని జలప్రళయము

వలన ఒకసారి నాశనము చేసెను. ఆ గొప్ప జలప్రళయములో నోవహు, అతని కుటుంబము తప్ప అందరు నశించిరి. మన పాపముల వలననే దేవుడు మనకు దూరమాయెను : "మీ దోషములు మీకును మీ దేవునికి అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను" అని దేవుని ప్రవక్తయైన యెషయా పలుకుచున్నాడు (యెష 59:1,2).

పాపము ఎంత ఘోరమైన దంటే దేవుని అద్వితీయ కుమారుడైన క్రీస్తు రక్తము తప్ప మరొక విరుగుడు దానికి లేదు. దేవుని కుమారుడైన క్రీస్తు రక్తము తప్ప, ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపమును తీసి వేయలేదు (హెబ్రీ 10:4). పాపము చేయు ప్రతివాడు శిక్షకు పాత్రుడు. అయితే పాపిని శిక్షించుటకన్న రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. ప్రతి పాపియొక్క శిక్షను క్రీస్తు తానే స్వయముగా సిలువలో భరించెను. అయితే పాపి యైన ప్రతివాడు రక్షించబడ వలెనంటే క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానములను విశ్వసించి వాటికి లోబడవలెను. క్రీస్తు ద్వారా కలిగిన రక్షణను పొందని ప్రతివాడును నిత్య నరకమునకు పాత్రుడగును.

క్రీస్తు ద్వారా కలుగు రక్షణను పొందవలెనంటే క్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుము. మారుమనస్సు పొంది ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందుము. ఆయన నీ విశ్వాసమును బట్టి నిన్ను తన రక్తములో శుద్ధునిగా చేయగలరు.

మానవులు చేయు దుష్క్రియ లన్నిటి కంటే పాపము ఘోరమైనది. దేవుని సన్నిధిలో తిరుగు బాటు చేసి పడిపోయిన ఒక దూత అపవాదియని

కొందరనుకొందురు. అది నిజమే అయిన యెడల, పాపము అపవాది కన్నా ఘోర మైనది! ఏలయనగా పాపమే అపవాది నీ తయారు చేసెను!! పాపము యొక్క ఉనికి యదార్థము. అది అన్ని చోట్ల యున్న మానవుల నందరినీ ఆవరించు కొని యున్నది. దాని ప్రభావము నెదుర్కొనని వాడు ఎవడునులేడు.

పాపము మోసకరమైనది. నీవు దేవుని ఆజ్ఞలకు లోబడకపోయినను ఆయన నిన్ను క్షమించునని నిన్ను మోసగించును. ఆదిలో ఆదాము హవ్వలను అది అట్లే మోసగించినది. దేవుడు కరుణామయుడు. ఆకరుణను, కృపను ఆయన క్రీస్తు ద్వారానే మనకు అందజేయు చున్నారు. నీవు క్రీస్తు అధికారమునకు నీ జీవితములో చోటియ్యని యెడల ఆయన కృప కాదు గాని ఆయన ఉగ్రత నీపై నిలుచును. దేవుని నెరుగని వారికి, క్రీసుయేసు సువార్తకు లోబడని వారికి ఆయన ప్రతిదండన చేయునని దైవ వేదము బోధించుచున్నది (2 థెస్స 1:7-9). పాపము నుండి విముక్తుడవు కాగోరుచున్న యెడల ఈనాడే క్రీస్తును నమ్మి బాప్తిస్మము పొందుము.

మీరు సత్యవాక్కు సాలు చందాకట్టారా? లేని యెడల ఇప్పుడే రూ.50/-లు ఎమ్.ఒ. చేసి మీ సభ్యత్వమును కొనసాగించు కొనండి.

సత్యవాణి

7-9-35, సాంబమూర్తి వీధి, కాకినాడ - 533 004.

# మార్పు జెందుట

## ( Conversion )

వయసు వచ్చిన ప్రతివారు ప్రభువు తట్టు తిరగవలెను. లేని యెడల వారు నాశనమగుదురు. మార్పు జెందకుండ ఎవరును పరలోక రాజ్యములో చేరలేరు. యేసు ఇట్లనెను : "మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మత్తయి 18:3). మార్పుజెందుట అవుసరమని ప్రజలు సాధారణముగ నమ్ముచున్నను మార్పు జెందుట అనగా యేమిటో అది ఎప్పుడు, ఎక్కడ ఎట్లు సంభవించునో యను విషయములను అపార్థము చేసి కొనుచున్నారు. మార్పుజెందు విధానమును బైబిలు విపులీకరించు చున్నది గనుక ఈ ప్రశ్నలకు జవాబును కనుగొను నిమిత్తము మనము బైబిలు నొద్దకు వెళ్ళవలెను.

**1. మార్పు జెందుట అనగా నేమి ?**

సాధారణముగా మార్పుజెందుట యనగా మారుట, మార్చబడుట యని మనము చెప్పుకొందుము. ఒక స్థితి నుండి వేరొక పరిస్థితికి మారు విధానము మార్పుజెందుట Conversion యగును. ఉదాహరణ : కలపను కాగితముగా మార్చుట, ముడి యినుము ఇనుముగాను, యినుమును ఉక్కుగాను, జంతువుల చర్మములను పాదరక్షలగాను మార్చుట.

లేఖనములలో మార్పుజెందుట యనగా ఒక పరిస్థితి నుండి వేరొక పరిస్థితికి మారుటయని యర్థము. బైబిలు ప్రకారము మార్పునొందుట యనగా నైతికముగాను, ఆత్మీయము గాను, కలుగు మార్పు. క్రైస్తవుడగుటలో ఒకడు దేవుని తట్టు తిరుగు విధాన మది. థెస్సలోనీకయులు క్రైస్తవులుగా

మారుటలో వారు "విగ్రహములను విడిచిపెట్టి జీవము గల వాడును సత్యవంతుడునగు దేవుని దాసులగుటకు.. దేవుని వైపునకు తిరిగిరి" యని పౌలు చెప్పెను (1థెస్స 1:9,10). మార్పు జెందుటలో మానవుడు పాపము నుండి దేవుని తట్టు తిరుగును.

ఎ). మార్పుజెందుటలో మానవుడు యిమిడి యున్నాడు.

మార్పుజెందుటలో మానవుడు తనకు తానే తిరుగవలసి యున్నదను సత్యమును బైబిలు వక్కాణించి చెప్పు చున్నది. గ్రీకు క్రొత్తనిబంధనలో మార్పు జెందుటయను పదముఒక వ్యక్తి తనకు తానుగా తన కొరకు జరిగించు క్రియయని సూచించు చున్నది. మార్పుజెందుటలో పాపి తటస్థముగా యుండక కృషి సల్పు వాడుగా యుండును.

బి) మార్పుజెందుట, క్షమించబడుట కాదు :

మార్పుజెందుట క్షమించబడుటతో సమానముగా కాదు. గాని ప్రభువు తట్టు తిరుగుటలో లేక మార్పుజెందుటలో క్షమించబడుట సంభవించును. దేవుడు క్షమించును. అయితే ఒక వ్యక్తి దుర్మార్గత నుండి దేవుని వైపు తిరిగినప్పుడు దేవుడు క్షమించును. దీనికి ఋజువుగా ఈ క్రింది వచనములను దయచేసి గమనింపుము :

"ఈ ప్రజలు కన్నులారా చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నా వలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది; వారి చెవులు వినుటకు మందములైనవి. వారు తమ కన్నులు మూసికొనియున్నారు. గనుక మీరు వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు, చూచుట మట్టుకు చూతురు గాని యెంత మాత్రమును తెలిసికొనరు" (మత్తయి 15:13; మార్కు 4:12).

"ప్రభువు సముఖమునుండి విశ్రాంతి కాలములు వచ్చునట్లును... మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తము మారుమనస్సు నొంది తిరుగుడి" (అపో.కా.3:19,20).

"భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపుల ను మానవలెను. వారు యెహోవా వైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలిపడును. వారు మన దేవుని వైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును" (యెషయా 55:7).

గనుక ప్రజలు తమ పాపములు క్షమింబపడు నిమిత్తము దేవునివైపు తిరుగవలెను. క్షమాపణ మానవుని హృదయములో కాక దేవుని మనస్సులో జరుగును. మానవుడు దేవుని చట్టము నకు విధేయుడగును. ప్రభువు తట్టు తిరుగును. అటు తరువాత దేవుడతని పాపములను క్షమించును (మార్కు 2:7; హెబ్రీ 8:12). గనుక దేవుని తట్టు తిరిగే పని మానవునిది. అతని పాపములను క్షమించే పని దేవునిది. ఒకడు దేవుని తట్టు తిరిగి క్షమాపణ నొందువరకు పాపియైన వాడెవడును పరిశుద్ధునిగా మార్పుజెందడు.

**సి) సారాంశము :**

పైన గమనించిన రీతిగా మార్పు నొందుటలో రెండు భాగములున్నవి. మొదటిగా మానవుడు చెడుగు నుండి మంచికి, పాపమును ప్రేమించి దానిననుసరించుట నుండి నీతిని ప్రేమించి దానిననుసరించుటకు మారవలెను. అటు తరువాత ఈ మార్పు జెందిన మానవుని పాపములను దేవుడు క్షమించును. ఒకనిని సాతాను రాజ్యము నుండి క్రీస్తు రాజ్యమైన సంఘములోనికి చేర్పు విధానము మార్పుజెందుట యగును (కొలస్స 1:13). గనుక మార్పు జెందుట యనగా ఒక పాపి క్రైస్తవుడగు సంపూర్ణ సువార్త విధానమై యున్నది.

అందువలన మార్పు జెందినవాడు మారిన వాడు. దేవుని తట్టు తిరిగిన వాడు.

**2. పాపియైన వాడు దేవుని తట్టు ఎట్లు తిరుగును ?**

పాపియైనవాడు సువార్త విని, విశ్వసించి విధేయత చూపించుటలో ఒకడు క్రీస్తు వైపు మారును. ఆ సంగతిని ఇదే పాఠములో తరువాత మనము కనుగొన గలము. దేవుడు మానవుని ఎదురాడలేని అద్భుతశక్తి వలన మార్చడు గాని అతడాయన తట్టు తిరుగునట్లు ఆత్మావేశము గల తన వాక్యము ద్వారా అనగా బైబిలు ద్వారా ప్రోత్సహించును. మార్పుజెందుటలో దేవుడు, మానవుడు కూడ ప్రాముఖ్య క్రియలను చేయుదురు.

మానవుడు లెక్క అప్పగింప వలసినవాడని అందువలన తాను గైకొను నిర్ణయముల కతడే బాధ్యుడని బైబిలు బోధించుచున్నది (మత్తయి 23: 37,38). మార్పుజెందుట యనగా తిరుగుట గనుక మంచి చెడుగుల ఎంపిక మానవుని క్రియయే యగును. యెహోషువ తన ప్రజలను ఇట్లు హెచ్చరించెను. "మీరు ఎవరిని సేవించెదరో...నేడు మీరు కోరుకొనుడి; మీరెవరిని సేవింపకోరుకొనినను నేనును, నాయింటి వారును యెహోవాను సేవించెదము" (యెహోషువా 24:15). "మీకు జీవము కలుగునట్లు మీరు నాయొద్దకు రానొల్లరు" అని క్రీస్తు కొందరితో అనెను (యోహాను 5:40). ఆయనకు లోబడవలసినదని ప్రభువు యెవనిని బలవంతపెట్టడు అని లేఖనములు బోధించుచున్నవి. పాపియైన వాడు నైతికముగా స్వాతంత్రుడని కూడ అవి బోధించుచున్నవి. అతడు తన స్వయిష్ట ప్రకారము నిర్ణయించుకొని దేవుని తట్టు తిరుగవలెను.

ఎ) మార్పునొందుట మర్మము కాదు :

మార్పుజెందుట యనునది చెప్పుటకంటె అనుభవించు ఒక అద్భుత విధానము కాదు. దేవుడు మానవునికి బైబిలు నిచ్చెను. రక్షింప బడుటకతడు ఏమి చేయవలెనో దాని ద్వారా ఆయన అతనికి తెలియ జేయును.

మానవుని సహకారము లేకుండగయే ఒక పాపిని మార్చుటకు పరిశుద్ధాత్ముడు అతని హృదయములో నేరుగ ప్రవేశించునని లేఖనములు బోధించుటలేదు. మార్పుజెందుట యనగా "మతాన్ని పుచ్చుకొనుట" కాదు. లేఖనములోని భావమును వ్యక్తపరచు లేఖన విరుద్ధ సంగతి యిది. ప్రజలను మార్చుటకు పరలోకము నుండి శక్తి పంపిచుమని ప్రార్థించువారు దేవునిని పక్షపాతిగా యుండుమని కోరుచున్నారు. ఈ విధానము సరియైనదయితే అట్లు అభ్యర్థించువారందరు మార్పుజెందిన వారెందుకు కాలేదు? ఎదురాడలేని నిర్జీవ శక్తి వలన మార్పు సంభవించు నని చెప్పు సిద్ధాంతము ఈ దిగువ కారణముల వలన అసత్యమై యున్నది.

1. అది మానవుని నైతిక స్వాతంత్ర్యమును నాశనము చేయును. మానవుని ఆధిక్యతలన్నిటిని తొలగించును. మార్పుజెందుటలో అతనిని మందకొడిగా తయారుచేయును. (మందకొడిగా మార్పుజెందుట మన రక్షకుడు యోహాను 6:29, 8:24; మత్తయి 7:21-27; మార్కు 16:16లలో చేసిన బోధకు విరుద్ధముగా యున్నది). పాపియైన వాడు మార్పు జెందుటలో క్రియాజనాత్మకతమైన వాడుగ పై వచనములు సూచించు చున్నవి.

2. ఒక వ్యక్తి క్షమాపణ నొందుటకు అతడు ఏమియు చేయ నక్కరలేదని అది సూచించుచున్నది. అందువలన రక్షణ బేషరతుగా

ఈయబడును (బైబిలులో హెబ్రీ 5:9; 6:17,18; 2 థెస్స 1:7-9; 1పేతురు 1:22లలో చెప్పబడిన వాటికి ఇది విరుద్ధమైనది).

3. అది దేవునిని పక్షపాతిగా చేయుచున్నది. అయితే బైబిలు ఇట్ల నుచున్నది. "దేవుడు పక్షపాతికాడు... ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును" (అపో.కా. 10:34, 35; రోమా 2:11).

ఒక వ్యక్తికి దేవుడు పరిశు ద్ధాత్మని నేరుగా పంపిన యెడల ఆయనను అందరికి తప్పక పంప వలెను. లేనియెడల పక్షపాతము చూప వలెను. ఈ సిద్ధాంతము ప్రకారము ఆ శక్తిని పొందకుండా ఒకడు మరణించిన యెడల యెవరు నిందించ బడవలయును? దేవుడే కదా? అయితే దేవుని వాక్యములో విశదపరచబడిన బోధకు, ఈ సిద్ధాంతము విరుద్ధముగా యున్నందున ఇది సత్యము కానేరాదు. మానవుడు తుదకు తానే పాపము నుండి తిరగగలదు, తిరగవలెను.

**బి) రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది.**

పాపులు మార్పుజెందునట్లు దేవుడొక శక్తిని ఉపయోగించడా? యని తరుచు కొందరు అడుగుదురు. అయితే సువార్తయే మార్పుజేయు దేవుని శక్తియై యున్నది. ఈ శక్తి దేవుడు సువార్త ద్వారా విని యోగించును. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడు వాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతి వానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్తునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16).

మానవుని రక్షించుటకు ఏది దేవుని శక్తియై యున్నది? అది క్రీస్తు సువార్తయని ఈ వచనము చెప్పు చున్నది. రక్షించు నిమిత్తము సువార్త

ఒక్కటే దేవుని శక్తియై యున్నది. అది పాపులను మార్చుటకు సంపూర్ణమై యున్నది. "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యదార్థమైనది. అది ప్రాణమును తెప్పరిల్లజేయును" (కీర్తన 19:7).

సువార్త బోధింపబడకుండ యెవడైనను క్రీస్తువైపు మార్పుజెంది నట్టి సందర్భము ఒక్కటి కూడ లిఖింపబడి యుండలేదు. పరిశు ద్ధాత్మావేశము కలిగిన వారిలో యెవడును ఒకవ్యక్తి మార్పు జెందవలె నంటే అతడు పరిశుద్ధాత్మను పొంద వలెనని యెవనికి బోధించినట్లు బైబిలులో కనబడుటలేదు. ఈ మార్పు జేయు శక్తిని క్రిందికి పంపించునట్లు ప్రార్థించుమని చెప్పు ఆజ్ఞ గాని, అట్టి మాదిరిగాని మనకు కనబడదు. సత్యవాక్యము ద్వారా ఆత్మ తన పనిని చేయును గాని నేరుగా మర్మ యుక్తముగా కాదు (యోహాను 6:63; 1పేతురు 1:23; యాకోబు 1:18).

బోధించుట ద్వారా ప్రభువు ప్రజలను తన యొద్దకు ఆకర్షించు కొనును (యోహాను 6:44,45). ఆయన తన వాక్యము ద్వారా ప్రజలు ఆయన తట్టు తిరుగునట్లు "మీరు చేయు హేయకృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పుకొనుడి...మీ దుర్మార్గత నుండి మరలి మనస్సు త్రిప్పుకొనుడి" యని హెచ్చరించుచున్నాడు (యెహెజ్కేలు 14:6; 18:23; 30:32; 33:11; 14:19; యిర్మియా 7:3).

అందువలన మార్పుజెందు టలో ప్రజలు కృషి సల్పనివారి గాను బాధ్యత లేనివారు గాను యుండిన యెడల వారికి బోధించవలసిన అవసరము లేనేలేదు. కాబట్టి వారు ఆయన తట్టు తిరిగి తమ పాపములను తుడిచి వేయించుకొన లేనందున నిత్య నాశన మమొందెదరు గాని ప్రభువు వారిని అంగీకరించ లేనందువలన కాదు (అపొ.కా. 7:51).

**సి) ఒకడు చిన్న బిడ్డవంటి వాడు కావలెను**

"మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోకరాజ్యము లో ప్రవేశింపరని" యేసు చెప్పెను. బిడ్డల వంటి వారనుటలో ప్రజలు పసి బిడ్డలు కావలెనని అనగా అమాయకులు, బోధింపబడతగిన వారు నమ్మిక యుంచు వారు, వినయ విధేయతలు కలవారుగ యుండవలెనని ఆయన ఉద్దేశ్యము. పరలోక రాజ్యము చిన్నపిల్లలతో కాదు గాని చిన్న పిల్లలవంటి ప్రజలతో నిండి యున్నది. అనగా బిడ్డలవంటి గుణ లక్షణములు గలవారితో నిండి యున్నది.

**3. మార్పుజెందుటలో కలుగు ఇతర మార్పులేవి?**

క్రీస్తు తట్టు మార్పు జెందుటలో ఒకనిలో కనబడు మార్పులు మూడు ఉన్నవి : 1) విశ్వాసము వలన హృదయములో మార్పు 2) మారు మనస్సు వలన జీవితములో మార్పు 3) బాప్తిస్మము వలన సంబంధములో కలుగు మార్పు. ఈ మూడు ప్రత్యేక మార్పులు జెందకుండ యెవడును దేవుని తట్టు తిరుగలేడు.

**ఎ) విశ్వాసము వలన హృదయములో మార్పు :**

క్రైస్తవ్యము హృదయ సంబంధ మైన మతము గనుక క్రీస్తు వైపు మార్పు జెందునపుడు హృదయములో మార్పు తప్పక కలుగవలెను. బైబిలులో కనబడు హృదయమనగా మనుష్యుని లో ఆలోచించునట్టిది, విశ్వసించునది, గ్రహించునది, కోరునది, నిశ్చయించునది, విధేయత చూపునట్టిది (మత్తయి 9:4; మార్కు 2:6; రోమా 10:10 మత్తయి 13:15; రోమా 10:1; సామె 3:5; 2కొరింధి 9:7; రోమా 6:17).

గనుక మార్పుజెందుటలో మారవలసినది, మనుష్యుని యొక్క

బుద్ధి భావోద్రేకములు గాని భౌతిక సంబంధమైన గుండెకాదు. ఈ మార్పు దేవుని వాక్యమును వినుట ద్వారా కలిగిన విశ్వాసము వలన సంభవించును (రోమా 10:17). ఒకడు నమ్మిన తరువాత అతని విశ్వాసప్రేమలు సాతాను నుండి క్రీస్తునకు మార్చబడును. మార్పుజెందుటలో ఒకడు యేసే క్రీస్తనియు, దేవుని కుమారుడనియు విశ్వసించి, పాపమును ప్రేమించుట మాని నీతిని ప్రేమించుటకు నిశ్చయించుకొనవలెను (యోహాను 8:24; మత్తయి 22:37). తద్వారా కలుగు విశ్వాస ఫలితమే హృదయ మార్పు అని పిలువబడును.

బి) మారుమనస్సు ద్వారా జీవితములో మార్పు :

సువార్త బోధించుట ద్వారా క్రీస్తు సిలువ వేయబడి తిరిగి లేచిన ప్రభువని స్థిరపరచబడినప్పుడు అతని జీవితము మార్చబడవలసియున్నది. క్రీస్తునందలి విశ్వాసము అతని జీవిత మార్పునకు దారితీయవలెను. అనగా అతడు పాపము నుండి తిరుగవలెను. ప్రతి విధమైన పాపమును విడనాడుటకు నిశ్చయించుకొని నీతి న్యాయముల ననుసరించవలెను (యెహె 18:5; 33:14,19). ఒకని ప్రవర్తనలో ఈ మార్పు మారుమనస్సు వలన సంభవించును. మారుమనస్సు అనగా పాపమును గూర్చి దైవ చిత్తానుసారమైన దుఃఖము వలన అది కలుగును. దాని ఫలితమే జీవితములో కలుగు మార్పు (మత్తయి 21:28,29; లూకా 15:17–20; యోనా 3:10; మత్తయి 12:41; 3:8; 2కొరింథీ 7:9,10; లూకా 13:3–5; అపో.కా. 17:30). పాపియైనవాడు పాపము నుండి తిరిగి దానికి వ్యతిరేక మార్గమును ప్రయాణించుటకు నిర్ణయించు కొనవలెను. అతడు క్రీస్తునందు విశ్వాసముంచుట కంటే యెక్కువ చేయవలెను. సమస్త

పాపముల నుండి అతడు వైదొలగి వాటిని సంపూర్తిగ విసర్జించవలెను. మారుమనస్సు గత జీవితమును మార్చ లేదు. గాని భవిష్యత్ జీవితమును మార్చి నడుపును.

**సి) బాప్తిస్మము ద్వారా సంబంధములో కలుగు మార్పు :**

విశ్వాసము మారుమనస్సు వలన దేవుని కొరకును నీతిగల జీవితము కొరకును తన్ను తాను ప్రమాణము చేసికొనిన తరువాత ఒకడు తన స్థితిని కూడా మార్చుకొనవలెను. క్రీస్తు దేవుని కుమారుడని ఒకడ తన విశ్వాసమును ఒప్పుకొనిన తరువాత ఈ స్థితి లేక సంబంధము బాప్తిస్మము వలన మార్చబడును (మత్తయి 28:19,20; రోమా 10:10). పౌలు ఇట్లు ప్రకటించెను : "క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి ఏలాగు లేపబడెనో అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:3,4 కొలస్స 2:12,13). "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27).

బాప్తిస్మము ఒకని హృదయము ను జీవితమును మార్చదు గాని విశ్వాసము మారుమనస్సుల వలన ఒకని హృదయము జీవితము మార్చ బడినందున అది అతని స్థితిని మార్చును. మార్పుజెందుటను సంపూర్తి చేయుటలో దైవమానవులు కలసి పాత్ర వహించు క్రియ బాప్తిస్మము. మారుమనస్సు నొందిన విశ్వాసి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును.

క్రీస్తులో యున్న ఆ వ్యక్తి ఒక నూతన సృష్టి, ఆయన శరీరములో ఒక సభ్యుడు క్రైస్తవుడు అగును (2 కొరింథీ 5:17; కొలస్స 1:12, 13, 14; ఎఫెసీ 1 : 22, 23).

**డి) వివాహము మార్పునకు సారూప్యముగా నున్నది :**

క్రీస్తువైపు మార్పుజెందిన ప్రతివాడు క్రీస్తు సంఘసభ్యుడై యున్నాడు. సంఘము క్రీస్తు యొక్క పెండ్లికుమార్తె యని చెప్పబడినది (ఎఫెసీ 5:22,23; రోమా 7:4; 2 కొరింథీ 11:2). ఒకడు క్రీస్తువైపు మార్పుజెందగనే ఆయన పెండ్లి కుమార్తెలో ఒక భాగమగును. గనుక లేఖనములలో వివాహములోను స్త్రీ మూడు విధములైన మార్పును అనుభవించును : 1. హృదయమార్పు 2. జీవిత మార్పు 3. స్థితిలో మార్పు

ఒక స్త్రీ తాను పెండ్లియాడబోయే పురుషుని కలసి కొన్నప్పుడు అతనిలో ఆమెకు అంత విశ్వాసము ఉండకపోవచ్చును. ఏది ఏలాగయినను మొదట ఆమె విశ్వాసము సంకుచితముగా యుండును గాని క్రమేపి అది పెరుగును. చివరకు అతనియందు ఆమె సంపూర్ణ విశ్వాసము కలిగి యుండినను ఆమె ఇంకను పెండ్లియాడలేదు. ఆమె హృదయము మారిన తరువాత ఆమె తన స్నేహితులను తగ్గించి వివాహమాడుటకు సంకల్పించుటలో నిమగ్నురాలై తన జీవితమును మార్చు కొనును. అంతే కాక జరుగవలసి యున్నది.

యేసుప్రభువని, రక్షకుడని ఒకడు విశ్వసించగానే పాపియైన వాడు మార్పునొందిన వాడని అనేకులు వాదింతురు. అయితే ప్రభువు తట్టు తిరుగుటలో సంభవించునది అంతా హృదయ మార్పేకాదు. ఒక పాపి క్రీస్తునందు విశ్వాసముంచగానే సంపూర్తిగ

మార్పునొందిన వాడన్నప్పుడు ఒక స్త్రీ తాను భావిలో పెండ్లి యాడబోయే పురుషుని యందు సంపూర్ణ విశ్వాస ముంచగానే ఆమెకు వివాహమై పోయినదని కూడ అనుకొనవచ్చును గదా!

అయితే ఉదాహరణకు వీరిద్దరికి ప్రధానము జరిగినది గాని వివాహము జరుగక ముందే ఆ పురుషుడు చనిపోయెనను కొందము. ఆమె పెండ్లాడిన స్త్రీ యగునా? చనిపోయిన పురుషుడు మిగుల ఆస్థి గలవాడైనను ఆమె దానిలో నుండి ఏమియు పొందదు. ఏలయనగా జరుగవలసిన ఆ ఒక్కక్రియ వివాహము జరుగలేదు. బాప్తిస్మము క్రియ కూడ అంతే. ఒకడు మార్పు జెందుటను సంపూర్ణము చేయునట్టిది.

**4. లేఖనముల ప్రకారము ఒకడు ఎప్పుడు మార్పుజెందును ?**

లేఖనముల ప్రకారము ఒకడు మార్పుజెందవలెనంటే హృదయమార్పు, జీవితమార్పు, స్థితిలోమార్పు ఈ మూడు మార్పులు అవుసరము. జరుగుచున్న మార్పు ఈక్రమ పద్ధతిలో జరుగవలెను. హృదయమార్పు జీవితమార్పు సంభవించినప్పుడే ఒకడు తన స్థితిలో జరిగే మార్పు కొరకు సిద్ధపడును గాని అంతకు ముందు కాదు. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందువరకు అతడు రక్షించబడినవాడు కాదు. అతడు దేవుని రాజ్యములో లేడు. అతడు క్రైస్తవుడు కాదు, దీనిద్వారా అతడు క్రీస్తులోనికి తేబడును. గత పాపముల నుండి రక్షించబడును. సంఘముతో చేర్చబడును (అపో.కా. 2:47). యేసు "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును" అని చెప్పెను (మార్కు 16:16).

మార్పునొందు విధానములో విశ్వాసము మారుమనస్సు తరువాత ఇంకొక మార్పు కనబడును. "నమ్మిన

వారనేకులు ప్రభువు తట్టు తిరిగిరి" యని పేతురు ప్రజల నాజ్ఞాపించెను (అపో.కా. 19). ఈ వచనములో కనబడు 'తిరుగుట బాప్తిస్మమై' యున్నది.

పాపము యెడల ఒకని తీరును విశ్వాసము మార్చును. ఒకని పాపపు అపరాధములను బాప్తిస్మములో దేవుడు కడిగివేయును. ఒకడు పాపమును ప్రేమించకను జరిగించకను యుండినను అతని అతిక్రమములను బట్టి ఇంకను అపరాధిగానే యుండ వచ్చును. ఉదాహరణకు, ఒకడు తాను చేసిన దొంగతనము నసహ్యించు కొనినంత మాత్రమున తన యపరాధము నుండి అతడు స్వతంత్రుడు కాజాలడు. గనుక పాపక్షమాపణ నిమిత్తము దేవుని సంకల్పము ఏమనగా : హృదయమును మార్చునట్టియు పాపమును జయించునట్టియు విశ్వాససము పాపపు కొనసాగుదలను అరికట్టునట్టియు జీవితమును మార్చు నట్టియు మారుమనస్సు, సంబంధమును మార్చునట్టియు అపరాధముల నుండి విడుదల చేయు నట్టియు బాప్తిస్మము అవసరము.

కాబట్టి మార్పునొందుటలో విశ్వాసము వలన హృదయము మార్చబడును; మారుమనస్సు వలన జీవితము మార్చబడును. ఒకని స్థితి లేక సంబంధము బాప్తిస్మము వలన మార్చబడును (క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొనిన తరువాతనే బాప్తిస్మము పొందవలెను). అప్పుడు మాత్రమే ఒక పాపి లేఖనముల ప్రకారము మార్పునొందినవాడును, తన గత పాపములు క్షమింపబడిన వాడును అగును.

విశ్వసింప బడినప్పుడు సువార్త పాపము యెడల ఒకని తీరును మార్చి దానిని ప్రేమించుట మాన్పించును.

అతని జీవితము దేవునికి అయిష్టముగా యున్నదని గమనించి అతడు తన పాపముల విషయమై మారుమనస్సు నొంది వాటిని జరిగించుట మానుకొనును. అట్లుచేసిన తరువాత మారుమనస్సు పొందిన విశ్వాసి క్రీస్తునందలి తన విశ్వాసమును ఒప్పు కొని తన పాపభారము తొలగించబడు నిమిత్తము బాప్తిస్మము పొందును. పాపియైనవాడు విశ్వాసము వలన పాపపు ప్రేమనుండి, మారుమనస్సు వలన పాపము జరిగించుట నుండి, బాప్తిస్మము వలన పాపభారము నుండి రక్షించబడును. (సశేషము)

- పెద్రికోతమ్

(మిగతా వచ్చే సంచికలో)

బైబిలు కోర్సులో చేరండి! బైబిలును పొందండి!

మీరు బోధకులయినా, సంఘసభ్యులయినా బైబిలు జ్ఞానమును సంపాదించుకొనండి. మేమిచ్చు ఉచిత బైబిలు కోర్సులో చేరండి.

ఒక బైబిలును ఉచితముగా పొందండి.

ఈ రోజే మాకు వ్రాయండి లేదా ఫోన్ చేసి

మీ అడ్రసు మాకు తెలియజేయండి.

**సత్యవాణి**

పోస్ట్ బాక్స్ నెం. - 80, కాకినాడ - 533 001.

ఫోన్ : 0884 - 2363722 / 98489 98547

# సంక్షిప్త వార్తలు

2018 మే నెల 23వ తేదీ సాయంత్రం జాషువాగూటం గారు రాజమండ్రి, బెంగుళూరు మీదుగా విమానయానం ద్వారా 24వ తేదీ సాయంత్రమునకు అమెరికాలోని మెంఫిస్ పట్టణమునకు సురక్షితముగా చేరుకొనిరి. మెంఫిస్ విమానాశ్రయములో రిక్కీగూటం దంపతులు,, వారి బిడ్డలు, రోనీగూటం దంపతులు వారి కుమార్తె ఫియోనా జాషువా గారికి ఘన స్వాగతం పలికి, రోనీ గారి యింటికి తోడ్కొని వెళ్లిరి. సోదరి కబితా గూటం గారు కూడ విమానాశ్రయములో జాషువా గారిని కలసికొని ఎంతో సంతోషించిరి.

2018 మే నెల 25వ తేదీ సాయంకాలమున మెంఫిస్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ గ్రేడ్యుయేడ్స్ యొక్క అభినందన విందు సోదరులు కీత్ మోషెర్ గారి గృహమునందు జరిగెను. దానికి జాషువా గూటం, రిక్కీగూటం, రోనీ గూటం గార్ల కుటుంబసభ్యులు ఆహ్వానింపబడగా వారందరు వెళ్లిరి. గూటం వారి సంతతకి చెందిన 9మంది అందులో పాల్గొనడం విశేషం. అమెరికా సహోదరులందరు ఆనందభరితులైరి.

2018 మే నెల 31వ తేదీ సాయంత్రం మెంఫిస్ మహానగరములో యున్న ఎస్.టి. ఫ్రాన్సిస్ ఆసుపత్రిలో సోదరి కబితా గూటం గారికి మెడ సంబంధమైన శస్త్ర చికిత్స చేయబడెను. అమెరికాలో ప్రఖ్యాతిగాంచిన న్యూరో సర్జన్ డా॥ జాన్ బ్రోఫీ గారు స్వయంగా ఆ ఆపరేషన్ చేసిరి. ఇంచుమించు రెండు గంటల సమయములో సోదరి యొక్క మెడ ఆపరేషన్ జయప్రదము గావించబడెను. ఇప్పుడు ఆమె రోనీ గూటం గారి యింటిలో నెమ్మదిగా కోలుకొను చున్నారు. సోదరి కబితా గూటం గారిని గూర్చి భారతదేశంలోను, అమెరికాలోను, ప్రపంచములోను పలు దేశములలోను అనేకులు ప్రార్థించిరి. ప్రార్థించిన వారందరికీ ఆమె హృదయపూర్వక వందనములు తెలియ జేయు చున్నారు.

2018 జూన్ 6వ తేదీ ఉదయం రిక్కీ గూటం దంపతులు వారి బిడ్డలు జస్టిన్ గూటం, రోజ్‌లిన్ గార్లు అమెరికా నుండి స్వదేశమునకు బయలు దేరిరి. వారి ప్రయాణం కొరకు ప్రార్థించిన వారికి వందనములు.

2018 జూన్ 10 నుండి 18 వరకు సంకల్పించిన వెకేషన్ బైబిలు స్కూలు యొక్క ఏర్పాట్లన్నియు సక్రమముగా జరుగుచున్నవి. ఈ పత్రిక ముద్రించు సరికి ఆ వేసవి సెలవుల బైబిలు తరగతులు కాకినాడలో జరుగును. ఈ తరగతులకు రాయవరం, ద్వారపూడి, నర్సీపట్నం, లచ్చిరెడ్డిపాలెం, చింతపల్లి, తుని, యానాం, రాజమండ్రి, కొమరిగిరి మొ॥గు ప్రాంతముల నుండి విద్యార్థులు వారి సువార్తికులతో వచ్చి ఎన్నో విషయములు నేర్చుకొనిరి. వీరికి విదేశీ సహోదరులు లూకాస్ గారు,

లిజ్ గార్లు ఆంగ్లకీర్తనలు, బైబిల్ కథలు నేర్పుటలో సహాయం చేసిరి.

2018 జూన్ 23న సువార్తికుల సదస్సును సహో॥ రిక్కీ గూటం గారు నిర్వహించిరి. పలువురు సువార్తికులు హాజరైరి. సహో॥ జో గారు ఆయన సతీమణి, మరియొక సహోదరులు ఈ సదస్సులో పాల్గొనిరి. జూన్ 26 నుండి జూలై 6వ తేదీ వరకు సహోదరులు రైట్ గారు కాకినాడ పరిసర ప్రాంతములలో వాక్యపరిచర్యలో పాల్గొని తిరిగి వారి ప్రాంతమునకు పయనమైనరి.

2018 జూన్, జూలై మాసములలో అమెరికా నుండి అనేక మంది యువకులు, పలువురు బోధకులు వచ్చి సత్యవాణిలో యువకులకు, అందరికీ చక్కటి వాక్యోపదేశము చేసెదరు. దానిలో పాల్గొను ఆసక్తి గలవారు రిక్కీ గూటం గారిని సంప్రదించ మనవి.

మంచి క్రైస్తవ సాహిత్యము ఇప్పుడు తెలుగు, ఒరియా కన్నడ భాషలలో కాకినాడ సత్యవాణిలో లభించుచున్నది. ఇప్పటికి మూడు పుస్తకములు కన్నడ భాషలో మా వద్ద లభించుచున్నవి. ఆయా భాషలలో ఆసక్తి గలవారు సత్యవాణికి ఫోన్ చేసి గాని, ఉత్తరాలు వ్రాసి గాని ఉచితముగా పొందవచ్చును.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-20

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.